# సన్మాన లాటరీ

## (క్రయ విక్రయ ప్రపంచంలో అమ్మకూడనివీ కొనకూడనివీ ఉండవు)

–సీయస్సీ మురళి, కేలిఫోర్నియా.

పోయిన నెలలో నాకు మూడు ఆఫర్లు వచ్చాయ్! ఎంతో కష్టపడిగానీ ఒక్కొక్కళ్లనీ వదిలించుకోలేక పోయాను. ఈనెల్లో అప్పుడే ఇది రెండోది. ఎంత ప్రయత్నించినా వదిలాడు కాదాయన!

మీకు సన్మానం చెయ్యాలని మా కార్యవర్గం నిర్ణయించింది, అన్నాడు. పేరు స్వామిదేవ సరస్వతిట.

"నాకా? సన్మానవా? చాల్లెండి, ఎవరన్నా వింటే నవ్విపోతారు. మా పక్కింటాయనకి తెల్సిందో చెవులకి తాటాకులొక్కటే తక్కువ..."

""అబ్బే! మీకా బెంగేం అక్కర్లేదండి. ఆయనకి పోయిన వారవే సన్మానం చేయించేసాం....

"ఆయనకా? సన్మానవా? ఎందుకు చేయించారు?"

"చేయించాలని మా కార్యవర్గం నిర్ణయించిందండి!"

"అసలు మీరెవరు?"

"నన్ను సరస్వతి స్వామిదేవ అంటారు. ఉభయ నగరాల రాజధానిలో నా పేరు తెలీని వాళ్లుండరు.. ఏటేటా జరిగే సారాయి పాటల్లాగే ప్రభుత్వం వారీమధ్య సన్మానవేలాలు కూడా నడిపిస్తున్నారు. ఆ వేలంలో మరో నలగురితో పాటు నేనూ పాటపాడి సన్మానాలు చేసే హక్కు కొనుక్కుంటానండి.. విదేశాల్లో ఉంటూ గొప్ప వ్యక్తిత్వమూ, మంచిపేరూ, స్థితిగతులూ, ఉదాత్తస్వభావమూ, సాంస్కృతిక స్పృహ, సాంప్రదాయాభిమానమూ, ఆవేదనా అలాంటి వాంఛనీయమైన లక్షణాలున్న వాళ్లందరికీ మా సంస్థ ఘనంగా సన్మానాలు చేయిస్తుందండి. ఈ సారి లాటరీలో తమపేరు తగిలింది. మా బోర్డు మెంబర్లు మీకు సన్మానం చెయ్యాలని అందుకే ఆత్రపడుతున్నారండి..!"

"సన్మానం చేయించుకునేందుకు నేనేవీ ఘనకార్యాలు చెయ్యలేదు స్వామిదేవగారూ ..! ఇంతకీ మీ సంస్థ పేరేవిటన్నారు?"

"ఏ సంస్థండీ?"

"అదే...! మీరు సన్మానాలు చేయించే సంస్థ."

"నాకూ నాలుగైదు సంస్థలున్నాయ్ లెండి, అందుకనీ కొంచెం కన్ఫ్యూజయ్యాను. సన్మానాల సంస్థా..? దాన్ని సరస్వతీశ్రీ ఎన్.ఆర్.ఐ.సన్మాన ఘూట్ అంటారండి."

"మీ కార్యవర్గం గురించి చెప్పండి, కాస్త..."

"నేను సరే, ప్రశిడెంటునండి! సెక్రటరీ ఏమో....సరస్వతీ స్వామిదేవ సెక్రటీ అండి.. ఇక ట్రెజ్షరర్‌గా స్వామిదేవ సరస్వతి,ది ట్రెజ్షరరాఫ్ ఎస్.ఎస్.ఎన్.ఆరై.ఎస్.జి అండి. ఆ పైన...."

"ఆగండాగండి! ప్రెసిడెంటు, సెక్రట్రీ, ట్రెజ్షరరు అన్నీ మీరేనా...?"

"అబ్బే...అదంత సింపుల్‌గా తేల్చాల్సిన మాట కాదండి... నేనున్నానంటే..ఒక పని చేసేటప్పుడు ఇంకో పని గురించి ఆలోచించ నండి. ఒక్కో పనికి ఒక్కో వ్యక్తిత్వం కావాలండి. ఇప్పుడు మీతో ప్రెశిడెంటుగా మాట్లాడుతున్నానా... ఈ విషయం సెక్రట్రీగ్గాని, ట్రెజ్షరర్‌గానీ తెలియవండి. మీరు సన్మానానికి అంగీకరించగానే సెక్రట్రీతోనూ, ఆ తర్వాత ట్రెజ్షరర్‌తోనూ ఇతర విషయాలన్నీ ? మాట్టాడిస్తానండి....క్లియర్ డివిజనాఫ్ లేబర్ లేకుండా పన్లు జరగవ్కదండి... కమింగ్ టుద పాయింట్, మీ అంగీకారం అయ్‌తే...ఇక"


"సన్మానానికి ఎలా ఒప్పుకోనండి...నేనేవీ సన్మానయోగ్యమైన పన్లు చెయ్యలేదన్నాను గదా..."

"అబ్బే ఎంతమాట..! అలా అనకండి మరోసారి.. మీ పక్కింటాయన అలా అన్నారా? సమ్మానం అనగానే టక్కున...ఎంత? అన్నారు. మా ట్రెజ్షరరు ఏదో అంకె చెప్పాడు. ఆయనేవో...ఎక్కువయ్యా, ఫలానా సంస్థవాళ్లు ఇంతకే చేయిస్తావన్నారు అని దానికంటే కొంచెం బుల్లితేడాతో ఓ సంఖ్య చెప్పారు.. తవర్తో బేరాలాడేంత చవకమనిషిని కాదులెండి, మీ ఆనందంకొద్దీ ఇంతకి తక్కువకాకండా మీరెంతంటే అంతేనండి అన్నాడు మా ట్రెజ్షరరు మరో అంకె విసిరి. బేరం కుదిరి పోయిందండి. పెద్దమనిషి వప్పందం అయిపోయింది. దాంతో మా సెక్రట్రీ రంగంలోకి దూకాడు. మీ కెలాంటి సన్మానం కావాలన్నాడండి."

"ఎలాంటి సన్మానాలుంటాయ్ అనడిగారండాయన."

"దాందేముందండి. బేసిక్ ప్యాకేజీతో మొదలు పెడతావండి. ఆవెనక ప్లాటినం ప్లస్సు, అపోలో పాకేజీ, ఇండస్ ప్యాకేజు అంటా యిలా పదారు, పదేడు రకాలున్నాయండి. మీరు ఒప్పందం చేసుకున్న ప్యాకేజిని బట్టి, బేసిక్ ప్యాకేజీయో ఏదో తేల్చేస్తానండి. మా ట్రెజ్షరర్‌తో బేరం ప్యూర్ బిజినెస్ ప్లజ్షర్లెండి. మాటంటే మాటేనండి అతన్తో....యకాయకిని పాయింటుకొచ్చేస్తాడ్లెండి"

"ఆ పాయింట్లో మళ్లీ మనం కలగజేసుకుని, పాకేజీలగురించి చెప్పావండి. ఒక దాంట్లో కవిత్వం, ఒకదాంట్లో నృత్యం, ఒకదాంట్లో నటన,



ఒకదాంట్లో వైద్యం, ఒకదాంట్లో శాస్త్రవిజ్ఞానం, ఒకదాంటో ఇక సంఘసేవ, ఒకదాంట్లో సాంస్కృతికం, ఒకదాంట్లో వైణికం, ఇక సాంకేతిక మార్పిడీ..ఇలా ఒక్కో అంశంలో ప్రావీణ్యత ఇమిడ్చావని చెప్పావండి.."

"ఇందులో తమకేదంటే అదే ఏర్పాటు చేయించచ్చండి!! కాంబినేషన్ కావాలంటేకూడా మా ప్రసిడెంటుగార్తో మాట్లాడి ఇబ్బందిలేకండా చెయ్యొచ్చండి అన్నాడు సెక్రటీ......వాటాలు పుచ్చుకుంటున్నప్పుడు మరి ఎవడిరోలు వాడు ప్లే చెయ్యాలకదండి"

"మరి వాటిల్లో మనకేది బాగుంటుందన్నారండాయన"

"దాందేవుందండి? ఏదయినా మనకి ఒకటేనండి. తమరికి దేనిమీద మనసుపోతే దాన్ని సూచించండి. అలాగ ఏర్పాటు చేయించేద్దాం. అన్నాడండి సెక్రటీ వినయంగా." "లాటరీలో మన పేరు ఎందులో వచ్చిందనడిగారండాయన."

"క్, స్, గ్, ర్ అనే నాలుగక్షరాల కిందా మనపేరు తగిలిందండి"

"అవేంటన్నారండి వారు"

"క్ అంటే కవిత్వం. కనికట్టు అనీ, స్ అంటే సాహిత్యం, సాంస్కృతికం, సామాజికం, సాంప్రదాయం వగైరా అనీ, గ్ అంటే గారడీ, గానం, గీర్వాణం మొదలుగానూ, ర్ అనగానే రంగస్థలం, రాజకీయం అంటున్నూ ఉన్నాయండి. పేటన్నట్లోనూ తమరి పేరు పలికిందండి. ఇక అవసరాన్ని బట్టి కొత్త కొత్త అంశాలు చేర్చడం మా ప్రశిడెంటుగారు చేస్తుంటారండి. తమరి లాటరీ బట్టి చూస్తే తమరు బహురంగాల్లో ఉన్నట్టు తోస్తుందండి...అనాడండి సెక్రటీ."

"ఆయన చాలా సంబరపడి, బాగుంది, బాగుందంటూ వాటిల్లో మనకేది నచ్చుతుందిసార్ అంటుంటే...."

"దాందేముందండి. ఏద్దైతేనేంటండి సన్మానం ముఖ్యంగానీ.... తమ మనసు ఎటు మొగ్గితే అదే కానిద్దావన్నాడండి సెక్రటీ. గాలి కొట్టడంలో మా సెక్రటీని చెప్పింతర్వాతే మరొహళ్లని చెప్పాలండి."

"కవిత్వం ఎలా వుండునండి? నేను చిన్నప్పుడోమాటు కవిత్వం అల్లిన గుర్తేనండి, అన్నారండాయన ఓ క్షణం ఆగి."

"ఇంకేవండి.? తవరాసిన......"

"అబ్బే ఇప్పుడవన్నీ....రాసే టైం...."

"అలాగంటే, మందగ్గర పెద్దపులుల్లాంటి క్రూరకవులు పదిహేనుమంది దాకా ఉన్నారండి. సంపాదన చాలక ఆకలితో ఉన్నారు. మనం సై అనాలేగాని రంకెలేస్తూ తీవ్రమైన కవిత్వం రాసిపారేస్తారండి. అలా వద్దంటే కడుపు నిండిన బాపతు వాళ్లూ ఉన్నారండి. భావ కవిత్వం, బావ కవిత్వం, వదినా మరదళ్ల సరదా కవిత్వం, భామ కవిత్వం, స్రియలిస్టు కావ్యాలు, సూపర్ క్వాలిటీ ఫెర్టిలైజర్‌లాంటి ఆశ కవిత్వం...ఏం కావాలంటే అలా రాసేస్తారు. కొంచెం ఖర్చు ఎక్కువండి. అలా కాదంటే నవలో, కథలసంపుటో రాసి పారేసే వాళ్లూ ఉన్నారండి.......కానీ నవల కంటే కవిత్వవే బరువుగా ఉంటుందని. నా హంబుల్ ఒపినియనండి.."

"కొంత పులి కవిత్వవూ, కొంతమేక కవిత్వం, కొంతగోవు కవిత్వం, కొంత మేరువులాంటి గంభీర కవిత్వం మేళవించామంటే ఎలా వుంఘుందంటారన్నారాయన"

"దాందేముందండి? మెటమార్ఫసిసు, గ్రోతు, ట్రాన్స్ఫర్మేషను చూపిచ్చినట్టుంటుందండి. అలాంటి పుస్తకం ఒకటి తమరు వ్రాసినట్టు రాయించెద్దావండి. చక్కగా బొమ్మలు వేసేవాళ్లు, తవరు తొమ్మిదోయేట చెప్పిన కవిత్వంలోని భయసంభ్రమాశ్చర్యాలు, విచ్చుకుంటున్న పరిశీలన,

పశిమనసులోని అమాయకత్వంతో మొదలుపెట్టి, వయసులో చెప్పిన కవిత్వంలోని ఉద్రేకం,ఆశయం,ఆవేశం మధ్య వయసులో కొచ్చేసరికి ఎలా చల్లగా మైదానంలో పారే నదిలా ఉడుకు, ఉరుకు తగ్గి పరిపక్వభావానికొచ్చిందీ అనే మెటమార్ఫసిసు చర్చిస్తూ గంభీరమైన వ్యాఖ్యానం ఒకరి చేతా, కొంచెం ఘాటైన విమర్శ మరొకరి చేతా రాయించి వేస్తామండి...''

''విమర్శా? అదెందుకు లెండి?''

''ఉండాలండి.. తమరి ఔన్నత్యం తెలియాలంటేనూ, క్రిడిబిలిటీ నిలబెట్టాలంటేనూ కొంత విమర్శ చిరునవ్వుతో, ఉదారంగా అంగీకరిస్తారన్నమాటు నలుగురికీ తెలియాలన్నాడండి, సెక్రటీ.''

''సరేలెండి...అనాయన అయిష్టంగానే ఒప్పుకున్నారండి.''

''మరలాగ కవిత్వం పాకేజి గురించి ఒప్పందం అయ్‌పోయిందండి. బేసిక్ ప్యాకేజీ తాలూకు లక్షరూపాయలూ-పోనీ మూడు వేల డాలర్లనుకోండి. కవిత్వంతాలూకు మరో 1500 డాలర్లు, పైన ఖర్చులూ, మామూళ్లూ అవీ 500 చిలుకూ, మొత్తం 5000 డాలర్లుఒప్పందం చేసుకున్నాక సగం ధరావతు ముట్టడంతో ఏర్పాట్లు చెకచెకా మొదలయిపోయాయండి.''

''ఆ చెక్కు మనకి సరస్వతీ వయోజనవిద్యా సహాయ సారణి పేర్న అందించారండి. దాంతో వారికి స్వచ్ఛంద సేవాశిరోమణి, సహృదయదయనీయ స్వభావప్రవీణ అనే అదనపు బిరుదులు కూడా ఇవ్వాలని నిర్ణయించిందండి మా బోర్డు.''

''పనిలో పని మా శ్రీమతికి కూడా....అన్నారండి.''

''దాందేముందండి. వాటిముందు శ్రీమతి అని రాసి యిద్దామండి...అయితే మా ట్రెజ్షరరు కొంచెం ఎక్స్ట్రా అంటాడేమోనండి...''

''కానివ్వండి... అన్నారాయన మరో వెయ్యికి ఒప్పుకుంటూనూ..''

''మనకి ఉభయనగరాల్లనూ, సభాధ్యక్షత వహించేందుకు, ప్రధాన ఉపన్యాసకులుగా ఉండేందుకు, పంచరత్నాలు అల్లి చదివేందుకు,మాజీ ఆచార్యపదవుల వారు, మాజీ మంత్రులు, సాంప్రదాయ కవులు, సభనలంకరించేందుకు ప్రేక్షక మహాజనులు ఇలా అందరూ ఏర్పాటులోనే వుంటారండి. ఏ నెలకానెల ఎన్.ఆరై.సన్మానఘాట్ షెడ్యూలు వారికి వెళ్లపోతుందండి. వారు ఉపన్యాసాలూ, కరపత్రాలూ, పంచరత్నాలూ అన్నీ తయారు చేసుకుని ఉంచుకుంటారండి..''

''మాజీ మంత్రులేవిటయ్యా పదవిలో ఉన్నవాళ్లెవరూ దొరకలేదా అంటుంటారండి కొందరు ఎన్..ఆరైలు. ఈ రోజుల్లో గవర్నమెంట్లకి ఆయుర్దాయం పడిపోయింది కదండి. దాంతో మాజీల నెంబర్లున్నంతగా, కరంటువాళ్లుండట్లేదు. అయినా సంపాదించచ్చు. అయితే ఎక్స్ట్రా ఖర్చులు పెట్టుకోవాల్సొస్తుంది. హోమ్మైతే ఓరేటు, రెవెన్యూశాఖకోరేటు...ఇలాగ రేట్లుంటాయండి.....''

''ఇక మన మాస్టారు ఇండియాకి ప్లేను టిక్కట్లు అవీ కొనుక్కొని వీలుగా ఉంటుందని, పిల్లల శలవులూ అవీ కలిసొస్తాయని మొన్న వేసంగుల్లో సన్మానం ఏర్పాటు చెయ్యమన్నారండి. మన కవులూ, విమర్శకులూ అందర్నీ వెంటనే పనుల్లోకి దింపేశావండి. పాతిక కవితలు చెకచెకా రాయించి రసధార అనే సంకలనం వేయించి, పుస్తకంతో బాటు రాసినవాళ్ల చేత చదివించిన టేపొకటి జతచేసి వారికి పంపి బాగా చదవడం అవీ ప్రాక్టీసు చేసుకు రమ్మన్నామండి. ఆయనకి వెతుక్కోవలసిన అవసరం లేకుండా ఉపన్యాసంకూడా ఒకటి రాయించి, కృతజ్ఞతలూ అవీ తెలియజేయడం అన్నీ రిహార్సలు చేసుకునే వీలు కల్పించాం.''

''సరస్వతీ సాహితీకేంద్రం తరఫున రసధార సంకలనానికి సమగ్రవాద సాహితీ పురస్కారం ప్రకటించారండి. న్యూస్‌పేపర్లన్నిట్లోనూ మనకి తెల్సినవాళ్ల చేత వ్యాఖ్యలు రాయించామండి. సారు ఉభయనగరాలు చేరే సమయానికి రసధారని నవకవిత్వ నక్షత్రంగానూ, పురోగామి కవిత్వవిభావరిగానూ, సాంప్రదాయకవిత్వ ప్రయోగంగానూ, సర్వజన సంక్షేమవాద పాంచజన్యంగానూ ఉల్లేఖించ బడ్డ రకరకాల రివ్యూలన్నీ కలిపి మళ్లీ సన్మానగ్రంథంగా తీసుకొచ్చి ఆ రోజున సభలో అందరి చేతుల్లోనూ అలంకరింపజేసామండి.''

''మాజీ ఆస్థానకవి గారు, బహుభాషా వ్యవస్థలకు సారథ్యం వహించి విరమించినవారూ అయిన విశ్వదాత భాస్కరపంతులు గారి అధ్యక్షతన సన్మాన సభ ఆరంభమైంది. పంతులుగారు స్వదేశంలో భాషాభిమానం కరువౌతున్న రోజుల్లో ప్రవాసతెలుగుల్లో ప్రజ్వరిల్లుతున్న భాషాభినివేశానికి, కవితాప్రకర్షకి హర్షం ప్రకటిస్తూ, రసధారలోని కవితలని కొన్నింటిని పేర్కొంటూ వాటిలోని సాంప్రదాయతకు ముచ్చటపడుతూ, ఆంధ్రసరస్వతికి వాటిని సరికొత్త కితకితలుగా అభివర్ణిస్తూ, కావ్యకర్తని ప్రశంసించి, మాలాంకృతులను చేసి, దుశ్శాలువ కప్పి, కరతాళధ్వనుల మధ్య అమెరికాతెనుగుమెరిక అనీ, రసహృదయవీచిక అనీ కొనియాడి మురిశారు.''

''ఆ తర్వాత సన్మానితులు రసధారలోంచి కొన్ని కవితలు చదివి ఏఏ సందర్భాలలో, ఏయే స్పందనల వల్ల, ఏయే కైతలను అక్షరబంధం చేసిందీ వివరించారు, వారికై మేం తయారింపించిన ఉపన్యాసాన్ని ఇంచుమించు కరక్టుగానే చదువుతూ......''

''ఆ పిదప మరో ఇద్దరు ముగ్గురు కవులు తమతమ అభినందనలు ప్రకటించి, మీ పరిచయస్థులు, పొరుగువారు, సాటిప్రవాసులు అయిన వారికి ప్రవాసకవిదుర్లభ అనే బిరుదు ప్రదానం చేయించడంతో ఆనాటిసభ మంగళప్రదంగా ముగిసింది.....అంటూ వివరించాడు సరస్వతీ స్వామిదేవ.''

''ఊపిరి తీస్కోడానికి ఓ క్షణం ఆగి, మరి యింతకీ తమరేవంటారు? అన్నాడు.''

''''దేనిమాటండి? అన్నాను పరధ్యానంగా.''''

''అదే తవరికి ప్రవాసచలనచిత్ర అని బిరుదు యిచ్చి సన్మానించే విషయం గురించండీ.'' (తరువాయి **24**వ పేజీలో)

అవసరమైనంతవరకు వారి జీవన విధానాన్ని పరిశీలించారే తప్ప పూర్తిగా వీరిని గురించిన పరిశోధన చేయలేదు.

*తెలుగులో జాలర్ల పాటలు* అనే శీర్షికతో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి సిద్ధాంత వ్యాసం సమర్పించడానికి నేను చేసిన పరిశోధనలో పట్టపుకారుల గురించి సందర్భోచితంగా విశ్లేషించినప్పటికీ వ్యాసం నిడివి ఎక్కువకావడం వల్ల వారి భాషావిశేషాన్ని వివరించలేక పోయాను. వారి అమాయకత్వంలోని సభ్యత, సంస్కారం, భాషలోని ప్రత్యేకతలు నన్నెంతగానో ఆకర్షించినందు వల్ల, తెలుగు సాహిత్యంలో ఏర్పడిన ఈ లోటును కొంతవరకైనా భర్తీ చేయడానికి ఈ వ్యాసం వ్రాయడం జరిగింది. అభిరుచి గల పరిశోధకులు, పట్టపుకారుల భాషా సంస్కృతులమీద పూర్తి పరిశోధన చేయడానికి నా ఈ ప్రయత్నం కొంతవరకైన ఉపయోగపడితే నా కృషి కొంతవరకు ఫలించినట్లే.

<u>ఉపయుక్త గ్రంథాలు:</u>


1) *తెలుగు జానపద గేయసాహిత్యము*, ఆచార్య బి.రామరాజు

2) *ఒంగోలు తాలూకాయందలి గ్రామనామాలు*, డా.పి.నాగమల్లేశ్వరరావు

3) *కోనసీమ జాలరి పాటలు - ఒక పరిశీలన*, డా.యు.సుబ్రహ్మణ్యేశ్వర శర్మ

4) *తెలుగులో జాలర్ల పాటలు*, డా.పి.చక్రపాణి

5) *కొల్లేటి పాటలు - ఒక పరిశీలనము*, డా.వి.వై.వి.సోమయాజి

6) *ఆంధ్ర భాషా వికాసము*, ప్రొ.జి.జె.సోమయాజి

7) *తెలుగు భాషా చరిత్ర*, ప్రొ.భద్రిరాజు కృష్ణమూర్తి

8) *తెలుగు పర్యాయపద నిఘంటువు*, ఆచార్య జి.ఎన్.రెడ్డి

9) *ఆంధ్ర వాచస్పత్యము*, శ్రీ కొట్టా శ్యామల శాస్త్రి


10) *వివిధ తెలుగు దినపత్రికలు*

11) క్షేత్ర పరిశోధనలో పట్టపుదారుల కులపెద్దల ద్వారా రాబట్టిన విషయాలు.

12) *Castes and Tribes of South. India*, Thurston Edgar, Vol. 2,4,6.

13) *Indian Womanhood - Then and Now*, Tellis Naik, B.

14) *Fisheries Statistics of Andhra Pradesh*, 1988. ¤¤¤


(<u>సన్మాన లాటరీ</u>.... **38**వ పేజీ తరువాయి)

"అబ్బే నేనేవీ చలనచిత్రాలు తియ్యలేదు, వాటిలో వెయ్యనూ లేదు నో...నో...నోనోనో.....," అంటున్నానేగాని నాగొంతు కొంచెం బలహీనమైందా అని నాకే అనిపించింది.

"పోనీ మీ అబ్బాయికి *గణితప్రకాండ* అనో, మీశ్రీమతికి *సంగీతగంగ* అనో, మీ అమ్మాయికి.........అనో..." ఏదో అంటూనే ఉన్నాడాయన.

"అబ్బే వాళ్లనెందుకులెండి ఇందులోకి లాగడం?"అని బలవంతంగా ఫోనుపెట్టేసాను.

ఆతర్వాత మరో యిద్దరు ఫోన్లుచేసి మళ్లీ మళ్లీ మా పేర్లు సన్మాన లాటరీలో వచ్చాయని మరీ మరీ బలవంతం చేస్తే నేను *చరిత్ర దుందుభి* అనీ మా ఆవిడ *సంగీతకోకిల* అనీ మా అమ్మాయి *నాట్యతటిల్లత* అనీ మా కుర్రాడు *ఉత్తమపుత్ర* అనీ బిరుదులు తీసుకోక తప్పలేదు..

అయితే నాకు అంతకు ముందు ఫోన్ చేసినవాళ్ళు, చివరికి సన్మానానికి వప్పించిన వాళ్లు ఒకరేనా కాదా అన్న సంగతి మాత్రం నేనిప్పటికీ తేల్చుకోలేక పోతున్నాను. చేసినాయన మాత్రం తాను ససేమిరా సరస్వతీ స్వామిదేవను కాదని వక్కాణిస్తున్నాడు.

*ఆ విషయం ఎలా వున్నా, రోజులు గడుస్తున్న కొద్దీ, సన్మానం చేయించుకొచ్చాక మనంకూడా ఎవరికీ తక్కువకాదులే అని మాత్రం అనిపిస్తోంది చెప్పద్దూ! ఆ సందర్భంలో తీసిన విడియోలూ, టి.వి.లో ఇంటర్వ్యూలాలూకు విడియోలు, ఇంటికొచ్చిన వాళ్లను కూర్చోబెట్టి చూపిస్తున్నప్పుడు ఇంతకాలానికి మనం యింత దారుణంగా కష్టపడి ఈ విదేశాలమ్మట సంపాదించిన డబ్బుకు ఈ మాత్రమన్నా ప్రయోజనం ఉండద్దా అన్పిస్తోంది* కూడాను.......¤¤¤

## హహ్హాహ్హాహ్హా....

ఓజర్నలిస్టుకు నలుగురు ఆసాములు తగిలారు.
ఒకాయన కొరియను,ఒకాయన రష్యను, ఒకాయన సౌదీ, నాలుగో ఆయన ఏ దేశంవాడో తెలీని న్యూయార్కరు.
జర్నలిస్టు ఏవండీ మీట్ షార్టేజ్ గురించి మీ ఒపినియన్ చెప్తారా అనడిగాడట ఆనల్గుర్నీ.
ఎక్స్‌క్యూజ్ మీ! వ్హాటీజ్ మీట్ అన్నాడట రష్యను.
ఎక్స్‌క్యూజ్‌మీ, వ్హాటీజ్ షార్టేజ్ అన్నాడట సౌదీ.
ఎక్స్‌క్యూజ్ మీ, వాటీజ్ ఒపినియన్ అన్నాడట కొరియన్.
వ్హాటీజ్ ఎక్స్‌క్యూజ్‌మీ అనడిగాట్ట న్యూయార్కాయన!!